# పశువు

గిట్టల చప్పుడు, మువ్వల గణగణా వినిపించేసరికి మెలకువొచ్చింది వీరయ్యకి.

బసవన్న తాడు తెంపుకు వెళ్ళిపోతుందా? చటుక్కున లేచి కూర్చున్నాడు.

మంటపం పక్కకి చూశాడు.

అక్కడ బసవన్న మాగన్నుగా పడుకొనుంది!


ఆ మసక చీకట్లో ఒంటెద్దు బండొకటి రోడ్డు వెంట వెళ్తోంది. దాంట్లో నల్గురాడవాళ్ళు కూర్చుని గట్టిగా మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు.

రైలు కెళ్తున్నారేమో? అనుకున్నాడు వీరయ్య.

ఆ మట్టిరోడ్డు మీద ఓ అరమైలు వెళ్ళి తర్వాత తార్రోడ్డెక్కి దాదాపు మైలు దూరం వెళ్తే గానీ రైల్వేస్టేషన్ రాదు. అందుకని ఆడవాళ్ళెవరైనా రైలు కెళ్ళదల్చుకుంటే - స్టేషన్ దాక ఇలా ఏ ఎద్దుబండి మీదో వెళ్తారు. మగవాళ్ళు అయితే మరింత పొద్దుండగానే బయల్దేరి నడిచి వెళ్తారందాకా!

వీరయ్య దృష్టి మళ్ళా బసవన్న వేపు మళ్ళింది.

చల్లగా కురుస్తున్న ఆ మంచులో పడుకొనుంది. దాన్నలా చూస్తుంటే ఎముకల గూడులా అన్పించింది వీరయ్యకి. వెంటనే తనవేపు చూసుకున్నాడు.



S-5

తనూ ఆలాగే ఉన్నాడు, బక్కచిక్కి అస్థిపంజరంలా. పగలల్లా తిరుగుడు, చాలీచాలని తిండి, యీ మంటప నిద్ర - మరింకెలా ఉంటాడు?

ఈ బసవన్న తప్ప వెనకా ముందూ ఎవరూ లేరు తనకి. నెల రోజులకో వూరు మారుస్తూ, ఇలా గంగిరెద్దు నాడించుకుంటూ బిచ్చమెత్తుకు బతకడమే తన జీవితం!

ఎంతో అసంతృప్తిగా అన్పించింది వీరయ్యకి.

ఆ మంటపం దాదాపు వూరు మధ్యగా అటు పంచాయితీ ఆఫీసుని, ఇటు శివాలయాన్ని పరామర్శిస్తూ నాల్గు వీధుల కూడలిలో ఉంది. తన లాంటి దిక్కుమాలిన వాళ్ళందరికీ అదే దేవేంద్ర భవనం, (పగలల్లా వూళ్ళోని పెద్దలు పేకాడుకోడానికి ఉపయోగపడుతుంది. అది వేరే విషయం. వీరయ్యలాంటి వాళ్ళకా మంటపమవసరం రాత్రి తల దాచుకోడాన్కేగా?) ప్రస్తుతం ఇరవై రోజుల్నుంచీ రాత్రిళ్ళు తను దాన్నాక్రమిస్తున్నాడు. మూడ్రోజుల్నించీ ఇంకో సన్నాసి కూడా దాన్లోనే మరో మూల ఇరుక్కున్నాడు!

అటు చూశాడు వీరయ్య.

ముడుచుకొని పడుకున్నాడు సాంబయ్య.

మెలకువొచ్చినా లేవబుద్ధి పుట్టడం లేదు వీరయ్యకి.

ప్రతిరోజూ యిది మామూలే. ఇలా మెలకువొచ్చిన ఏ అరగంటకో గానీ లేవలేడు!

(వీరయ్యకి మెలకువ రాగానే వూళ్ళో ఉన్న పెద్ద మనుషులంతా గుర్తుకొస్తారు. తర్వాత వాళ్ళ దర్జా గుర్తుకొస్తుంది. ఆ తర్వాత వాళ్ళు తనలాంటి వాళ్ళని చూసే నీచమైన చూపు గుర్తుకొస్తుంది. అంతే! అతని రక్తం కుతకుతలాడిపోతుంది. వీళ్ళ పొగరు మొత్తనాన్ని ఎలా అణచాలా

అని మనసు పరిపరి విధాలా పోతుంది. వళ్ళంతా వేడెక్కి పోతుంది. కానీ అప్పుడు రక్కున వాళ్ళనేమీ చేయలేని తన అసమర్థత గుర్తుకొస్తుంది. నీళ్ళుగారిపోతాడు. తన్ని తన్నే తిట్టుకుంటాడు ... ఇలా కొంతసేపు జరిగిన తర్వాతగానీ లేచి పన్లకుపక్రమించడు.)

—లేచి బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు వీరయ్య.

మంటపం దిగి, ఆప్యాయంగా బసవన్నని నిమిరాడు.

అతని చెయ్యి మీద పడగానే ఆశగా అతని వంక చూసింది బసవన్న. వీరయ్యకి దానిమీద విపరీతమైన జాలేసింది.

(జాలి పట్టం కన్న తనేం చేయగల్డు?) పక్కనే వున్న వేపచెట్టు వేపు కదిలాడు. అందుబాటులో నున్న ఓ కొమ్మ నందుకొని విరిచాడు.

"ఏరోజు పుల్ల ఆరోజు తెంపుకోబోతే ఒకేసారి నాల్రోజులకొచ్చేట్టు పుల్లలు తెంపుకోరాదూ? ఏం మడిసివయ్యా?... సర్లే. నాకూ ఓ పుల్ల పారేయ్." సాంబయ్య లేచి, తన చిరుగుల గొంగళిని దులిపి- మడతబెట్టు కుంటూ అన్నాడు.

వీరయ్య కడుపు మంటగా నవ్వేడు.

"రేపటి కోసం- ఇంకొచ్చే నాల్గు తరాల కోసం ఇయాల సంపాయించి పెట్టుకోడాన్కి నేనేమన్నా కర్ణంగోర్నా? మున్సబుగోర్నా? లేక పెద్దరెడ్డిగోర్నా? ఛత్... మన కట్టాటివి గిట్టవ్. మనకి రేపనేదుండాలేగానీ, సెట్టట్టాగే వుంటది! ఏరోజు పుల్ల ఆరోజే తెంపుకుంటాను. నాకేం బద్ధకంలేదు. అయినా సన్నాసోడివి నీకూ్కడా రేపటి యావేందయ్యా? ఇంద పట్టు—" అంటూ ఓపుల్ల అతనివేపు విసిరేశాడు వీరయ్య.

కాలకృత్యాలు తీర్చుకుని బసవన్న దగ్గర కొచ్చాడు. అతన్ని చూడగానే బసవన్న లేచి నుంచుంది.

మంటపంలో వేసుకున్న పక్కని దులిపి మ
బసవన్న వీపుమీద వేశాడు. దానిమీద తన పంచెలు, చ
వేశాడు. అంచులు చివర విరిగిన సన్నాయిని నొక్కలు
అపస్వరాలొచ్చాయ్!

'యదవ బతుకు-యదవ మేళం.' సణుక్కుంటూ

మంచుపడి మట్టిరోడ్డు చదునుగా వుంది. ఇదే
సరికి తడారిపోయి విపరీతంగా దుమ్ములేస్తుంటుంది.

భోగి మంటల ముందు వేప్పుల్లలు నములుతూ,
చెప్పుకుంటూ చలి కాచుకోవటం అయిపోయి ఒక్కొక్క
దేరుతున్నారు. ప్రతివీధి మొదట్లోనూ ఇలాంటి మంట
ఉన్నాయి. ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోవడంతో మనుషుల్తో
దుంగలేమీ వెయ్యకపోయినా- అంతకు ముందున్న నిప్పే
రోడ్డు మధ్య ఉన్న వాటి నార్పాలనే ధ్యాసెవ్వరికీలేదు.

వీరయ్యకి బోణీమీద మంచి నమ్మకముంది.

'ఆ ఎత్తరుగుల బాపనాల్లింట్లో ఓయమ్ముంది -
గుప్పెడు బియ్యం ఏసిందా-నాసామిరంగా ఆరోజు తనెద్ద
క్సనే!' ఆశగా ఆ యింటి ముందుకొచ్చి ఆగాడు.

''అమ్మగోరికి దన్నంపెట్టు... అయ్యగోరికి ద
సన్నాయి వూదడం ప్రారంభించాడు.

తిండిలేక డొక్క లెక్కు కొచ్చిన ఆ ఎద్దు హ
వూపల్దు? దేబలాగా అలాగే నిల్చుంది.

"అమ్మా! కూసిని వడ్లో, బియ్యమో ఇప్పించ
అడిగాడు.

"పోవయ్యా! చెయ్యి ఖాళీగా లేదు." రోజూ తెల్లారేసరికల్లా ప్రత్యక్ష మయ్యే అతన్ని చూసేసరికి అసలే చిరాగ్గావున్న అమెకి మరింత చిరాకేసింది.

వీరయ్య సెంటిమెంటు దెబ్బతింది. ప్రాణం వుసూరుమంది. చివ్వున కోపం ముంచుకొచ్చింది. అయినా రోజూ వేసే మనిషి కావడంతో మారు మాట్లాడలేక ముందుకు నడిచాడు.

అప్పటికే ప్రతి యింటిముందు చక్కగా చిమ్మి, కళ్ళాపిజల్లి రక రకాల ముగ్గులుపెట్టి వున్నాయ్. ముగ్గులు మధ్య గొబ్బిళ్ళు కూడా ఉన్నాయ్. అలా వాటి మధ్యగా నడుస్తుంటే చెప్పలేనటువంటి చక్కని అనుభూతి కల్గుతోంది వీరయ్యకి.

సంక్రాంతి పండుగ దగ్గర పట్టంతో వూళ్ళో నూతన చైతన్యం వచ్చింది. సందడి బాగా పెరిగింది.

'పండగ రోజుల్లో బిచ్చం పెరగాల్సిందిపోయి తగ్గిపోతోంది. రోజులు మారిపోయాయి...' సణుక్కుంటూ ఆ పక్కనే వున్న ప్రెసిడెంటుగారి మేడ కేసి నడిచాడు.

మేడ చుట్టూతా బోల్డంత స్థలం. పెద్ద ప్రహరీగోడ. వీధి గుమ్మంలో నిలబడి సన్నాయి వాయించడం ప్రారంభించాడు.

పంట ఇంటికొచ్చినట్లుంది. పాలేళ్లు హడావుడిగా వున్నారు. ప్రెసిడెంటుగారు పాతకాలంనాటి కొయ్యకుర్చీ ఒకటేసుకుని కూర్చుని అజ్ఞలు జారీ చేస్తున్నారు. ఆయన నోట్లో పెద్దచుట్ట కాల్తోంది.

కాసేపు సన్నాయి వాయించి అలవాటు ప్రకారం ప్రారంభించాడు.

"ప్రెసిడెంటు గోరికి దన్నం పెట్టు. దరమ పెబువుకీ దన్నం పెట్టు..." ఎద్దు మీదవాలిన ఈగల్ని తోలుకోడాన్కి తల, తోక ఆడించింది.

అతని గొడవక్కడెవ్వరూ పట్టించుకోవడం లేదు.

సన్నాయి గట్టిగా వూదడం ప్రారంభించాడు.

ప్రెసిడెంటు గారికి చిర్రెత్తుకొచ్చింది.

"బాబూ! కొత్తవడ్లో...బియ్యమో..." సణిగాడు.

"ఏందిరా గోల నాయాల! ఫో... అవతల్కి..." విసురుగా కసిరి మళ్ళీ తన గొడవలో పడిపోయాడు.

వీరయ్య కదల్లేదు. తిరిగి సన్నాయి నూదడం ప్రారంభించాడు: ఇటువంటి కసుర్లకి, విసుర్లకి అతను అలవాటుపడిపోయాడు. పేదవాడి కోపం పెదవికి చేటనే విషయం అతనికి బాగా తెల్సు. అందుకే అన్నింటిని భరిస్తూ బిచ్చం పడేంతవరకూ గుమ్మాన్నొదలడు.

ప్రెసిడెంటు గారి కోపం తారాస్థాయికి చేరుకుంది.

"గాడ్దెకొడకా! మా గొడవేందో మేం పడ్తుంటే మధ్య నీ గొడవేంది?"

"నా కివాళ్టికి తిండిలేక నేను కొట్టుకుంటూంటే ఈ నాయాల్లెప్పటికో దాసుకుంటున్నారు. పక్కోడు ఆకల్తో సత్తావుంటే-ఈల్లు తమ కడుపులు, గోదాలు నింపుకుంటూండారు. ఈల్ల ననాల్సిన పన్లేదు. డబ్బు-ఆ ఎదవ డబ్బు సేత్తా వుందంతా! తను, తన పెళ్ళాం, పిల్లలు అంతే! పక్కోడు తిండిలేక సచ్చినా పర్లేదు. ఇలాంటి సార్థపు నాయాల్లనేం చేసినా పాపం లేదు." సణుక్కుంటూ అక్కడ్నించీ కదిలాడు తన బక్క ఎద్దుతో.

ఆ పక్కనే ఓ కొట్టుంది.

అప్పుడే తలుపులు తీసినట్లున్నాడు లక్ష్మయ్య; సర్దుకుంటున్నాడు.

అతని చుట్టూ చిన్న చిన్న అరల్లో రకరకాల దినుసు లున్నాయ్. ముందు పెట్టెల్లో రకరకాల పప్పు ధాన్యాలున్నాయ్. ఒక మూల బెల్లపు

అచ్చులు...ఈగలు జుయ్‌మని ముసురుకుంటున్నాయ్. పక్కనే కొన్ని హార్లిక్స్ సీసాల్లో వేరుశెనగ ఉండలు, నువ్వు జీడీలు, చౌకరకం పిప్పరమెంట్లు ఉన్నాయ్. ఒక పళ్ళెంలో జంతికలున్నాయ్. సగం గెల అరటి పండ్లకి పైనే వేళ్ళాడుతున్నాయ్. అందులో సగం కుళ్ళిపోయి ఉన్నాయ్!

—ఇవన్నీ పరికిస్తూ నిరుత్సాహంగా సన్నాయి వాయిస్తున్నాడు వీరయ్య, బసవన్న మరింత నిర్లిప్తంగా నిలబడిందతని ప్రక్కనే.

బియ్యం కొలిపించుకోడాన్కి అప్పుడే కొట్లొకి వచ్చిన రంగితో రెండర్థాల మాటలు మాట్లాడుతున్న లక్ష్మయ్యకి వీరయ్య సన్నాయి వాయిద్యం కర్ణకఠోరంగా విన్పించింది.

"పొద్దున్నే ఎదవగోల. బేరాలకన్నా ముందే మొదలు. పో... అవతల్కి."

వీరయ్యకి వళ్ళు మండిపోయింది.

"అడిగినోడు, పెట్టినా పెట్టకపోయినా రెండోవాడికి లోకువే; పెతీ ఎదవా పో అవతల్కి, పో అవతల్కి ... ఇలా ఎన్ని మాటలన్నా భరించాలి."

కొట్టు కొచ్చిన వాళ్ళల్లో ఒకళ్ళు ఒక నయాపైస బిళ్ళ అతని చేతిలోకి విసిరేశారు.

"హుఁ! పైసా; ఇలాంటి ఎన్ని పైసలు గలుత్తె ఒక రూపాయవుద్ది...కడుపు నిండుద్ది..సీ.సీ ఎదవ బ్రతుకు." పౌరుషంతో పక్కకి కదిలాడు వీరయ్య.

తన కొట్టు కొచ్చిన వాళ్ళల్లో ఒకరు పైసా ధర్మం చెయ్యడంతో లక్ష్మయ్యకీ పౌరుషం ముంచుకొచ్చింది. వీరయ్య నాగమని ఓ కుళ్ళిన అరటిపండుని గెలలోంచి తుంచి—

''ఎదవా! ఎంతసేపటికీ నీ కడుపు సంగతే సూసుకుంటావ్ గానీ, ఎద్దు సంగతి సూట్టల్లేదల్లే ఉంది. పిచ్చిముండ ఎలా ఉందో సూడు— ఎముకలన్నీ బయటికొచ్చి! ఈ పండుని దానికిపెట్టు.'' ఆ పండుని విసిరేశాడు. వీరయ్య దాన్ని కిందపడకుండా పట్టుకుని బసవన్న నోటి ముందుంచాడు.

దాన్ని వాసన చూసి వద్దన్నట్లు తల పక్కకి తిప్పింది బసవన్న.

పండుని పక్కకి పారేసి బయల్దేరాడు వీరయ్య.

బసవన్న ఆశగా అరటిగెల కేసి చూస్తూ కదల్లేదు.

వీరయ్యకి చిర్రెత్తుకొచ్చింది.

'ఇదొక కరువు మేలం! ఎంతసేపటికీ తిండి ధ్యాసే! ఆ నాయాల్లకే మాత్రం తీసిపోదు. నీ ఎద్దునమ్మ - కదలయే.' చేత్తో గట్టిగా పొడిచాడు బసవన్నని. అది నెమ్మదిగా కదిలింది.

అతను - అతని వెనకే ఎద్దు.

ఎక్కే గడప—

దిగే గడప!

పెట్టేవాళ్ళు పెడుతున్నారు.

తిట్టేవాళ్ళు తిడుతున్నారు!

వీరయ్య మనసు మండిపోతోంది. తన కోపమేమాత్రం బయట పడకుండా బలవంతాన తనలోనే అణచుకున్నాడు.

ఎండకూడా అతని బతుకులాగే అంతంత మాత్రంగానే వుంది.

'ఇయ్యాల లేచినేల బావుళ్ళేదు. ఒక్క కొంపలోకూడా గుప్పెడు గింజలు దొరకలేదు. గంగిరెద్దులాడంటే పిల్చి బియ్యం, వడ్లు పెట్టే రోజులు పోయాయ్. తిన్నవాడు మరింత పోగేసుకుని దాచుకునే

పెయత్నం!దరమం మాటే మరసిపోయారు. సీ...సీ...ఎదవ పెపంచం. సోసకొచ్చేట్టుంది.ఆ యమ్మెవరో సద్దన్నం మిగిలిపోయినట్టుంది పిలిచి మరీ పడేసింది, వెంటనే తినాలి. లేకపోతే కళ్ళు తిరిగి పడిపోగల్ను.'నెమ్మదిగా ఎద్దుని నడిపించుకుని నడిగెడ్డపాలెంకేసి నడక సాగించాడు.

అప్పుడతనిలో తన ఆకలి గురించే ఆలోచన. అంతే.

డొంక చేరుకోగానే తుంగభద్ర ఒడ్డున ఓ చెట్టు నీడవ కూలబడ్డాడు - అడుక్కోగా వచ్చిన అన్నం మూటతో.

ఆత్రంగా గబగబా తినసాగాడు.

కాగానే —

అన్నం మూటగట్టిన గుడ్డని దులిపి భుజాన వేసుకొని తుంగభద్రలో కాళ్ళూ చేతులూ కడుక్కున్నాడు. ఆ గుడ్డతోనే తుడుచుకున్నాడు.

కడుపులో కొద్దిగా పడేసరికి నిద్ర ముంచుకు రాసాగింది. చెట్టు నీడనచేరి కునుకు తీద్దామనుకున్నాడు.

కానీ ఎలా?

ఇవ్వాళసలేమీ దొరకలేదు.

కాసేపు పడుకోవాలనే ప్రయత్నాన్ని విరమించుకుని బసవన్న దగ్గరకెళ్ళాడు, అది నీరసంగా కూలబడి వేదాంతిలా చూస్తోంది తనవంక.

దగ్గరకు రాగానే లేచి నిల్చుంది-ఆశగా చూస్తూ తోక కదిల్చింది.

"దీనమ్మ...దీనికి గడ్డి తినిపించి రెండు రోజులైంది. తన చేతిలో ఏగానీ లేందే దానికేం తినిపించగలడు గడ్డి?" బసవన్నమీద జాలి పడ్డాడు వీరయ్య.

బసవన్నని తుంగభద్ర నీళ్ళదగ్గరకి తీసుకెళ్ళి ఒళ్ళంతా ప్రేమగా కడిగాడు. తన దగ్గరున్న గుడ్డతో దాన్ని తుడిచి, తుడిచిన ఆ గుడ్డని దాని వీపుమీదే ఆరేశాడు.

బసవన్న వీపుమీద కప్పున్న బొంతకి రెండువేపులా రెండు సంచీ లున్నై. ఒక పక్క ఎవరయినా పెట్టిన బియ్యం, వడ్లు మొదలైనవి వేసు కోవడానికి వీలుగా రెండు మూడర లున్నాయి. రెండోపక్క సంచిలో గిన్నె కంచం గుడ్డలు మొదలైన వస్తువులు పెట్టుకుంటాడు.

నెమ్మదిగా ఎద్దుని కదిలించుకుని బయల్దేరాడు పక్కనున్న పల్లెకి. ఇలా రోజుకు మొత్తంమీద రెండుమూడు పల్లెల్లోనైనా అడుక్కుంటాడు.

తిరిగి మామూలే.

ఎక్కే గడప-దిగే గడప.

నాలుగు డబ్బులు, కొద్దో గొప్పో బియ్యం, వడ్లు వచ్చాయి.

రాత్రి ఏడుగంటల సమయంలో తిరిగి మంటపం జేరుకున్నారిద్దరు.

మండపం పక్కనే రావిచెట్టు, వేపచెట్టు మొలిచాయి. వాటి రెంటికీ బ్రహ్మాండంగా పెళ్ళి చేసినట్లున్నారు. పసుపు, కుంకుమ, దాని చుట్టూ రచ్చబండ - ఇవే అందుకు నిదర్శనాలు.

"నా కడుపు కాల్తుంటే ఇంత బిచ్చమేయడాని కూడా ఏడిసే పెద్దలు సందాలేసుకుని ఈ సెట్లకి పెల్లి సేయించుతంటారు.

మరమన్నేయం... ఈళ్ళనేం చేసినా పాపంలేదు'' అతని మనసు ఉక్రోషంతో వుడికి పోతోంది.

నడిచి నడిచి కాళ్ళు నెప్పులు పుడుతున్నాయి.

నడుం లాగుతోంది.

బసవన్నని మంటపం పక్కనే వున్న గుంజకి కట్టేసి దాని మీదున్న బొంత నందుకుని మంటప మెక్కాడు.

బసవడు కూడా నిలవలేక కూలబడ్డాడు!

దానికీ కాళ్ళు లాగుతున్నాయి, కడుపు మండుతోంది.

వీరయ్య ఆరోజు వచ్చిన బియ్యం, వడ్లు- డబ్బులు అన్నీ వేరుచేసి, లెక్క చూసుకున్నాడు.

కడుపు మండుతోంది.

మంటపం కింద రాళ్ళు చేర్చి పక్కనే వున్న చింతల తోపులో కెళ్ళి, కొన్ని చితుకులేరుకొచ్చి పొయ్యి రాజేశాడు. బొంత సొరుగులోంచి గిన్నె నితీసి తను తెచ్చిన బెయ్యం దాంట్లో పోశాడు. పక్కనే వున్న పంపు దగ్గర కెళ్ళిబియ్యం కడిగి పొయ్యిమీద పడేశాడు.

మంట ఆరిపోకుండా మధ్య మధ్య చితుకుల్ని పొయ్యిలోకి తోస్తు న్నాడు.

అతని మనసులో కూడా మంటలు రేగుతున్నాయ్!

'తన్లాంటివాడు తింటానికీ లేక, పడుకోడానికి లేక ఇలా నానా అవస్థలు పడుతూ వుంటే నాయాల్లు పొట్టలు పగిలేట్టు తిని మరో జనమ కూ్కడా సరిపడా ఇనప్పెట్టెలాంటి ఇల్లల్లో దాచుకుని సుకంగా ఉంటు న్నారు. అల్లూ మడుసులే నేను మడిసినే! మరి మా యిద్దరి జీవితాల్లోనూ ఈ తేడా ఏంది?' కడుపు మంటగా కరణం గారింటివేపు జూస్తూ అను కున్నాడు వీరయ్య.

ఇంతలో సాంబయ్య కూడా అక్కడికే జేరుకున్నాడు.

తెగ తిరగడంలో వీరయ్యకి ఒళ్ళంతా నొప్పులు పుడుతున్నాయ్.

'ఇది ఒక రోజుతో పోయేది కాదు. పెతీ రోజూ ఉండేదే. ఏరోజూ తిరక్కపోతే ఆ రోజు కూడుండదు తనకి. నాయాల్లు అల్లు మాత్రం ఇంట్లోంచి కదలకుండానే మిద్దెమీద మిద్దెమీద కట్టేస్తుండారు. అబ్బా-వల్లంతా నొప్పితో సలుపుతోంది. కాత్తంత సుక్కపడితే గానీ నొప్పులు తగ్గవు. ఉన్న నాల్గు డబ్బులూ అందుకు సాలవే...ఎదవొడ్లు ఇవుండి మాత్రం

తనకెందుకూ? వీట్ని లచ్చమ్మ కొట్లో పడేసి డబ్బులు తీసుకుంటే గానీ సుక్కకి సరిపోదు...' అన్నం వుడికితే దించమని సాంబయ్యకి చెప్పి - వడ్లు కొట్లో పోసి- వచ్చిన డబ్బుల్తో వడివడిగా మొగలి డొంకకేసి కదిలాడు.

దాదాపు ఓ ఇరవై నిమిషాల తర్వాత తడబడ్తూ తూల్తూ మంటపం జేరుకున్న పీరయ్యలో నూతన చైతన్యం చోటు చేసికొంది.

ఈలోపల వుడికిన అన్నాన్ని సాంబయ్య దించడం,దాంట్లో కొద్దిగా కతకడం, నిద్రపోవడం కూడా అయిపోయింది.

ఎవరో దానం చేసిన పచ్చడితో త్వర త్వరగా రెండు మెతుకులు తిని, బొంతమీద అడ్డం పడిపోయాడు పీరయ్య.

ఆతనికి కొద్దిదూరంలోనే గుప్పెడు గడ్డి కోసం అలమటించి పోతున్న ఎద్దు కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని ఇంకా ఆశ చంపుకోలేక అతని వంకే ఆశగా చూస్తోంది.

తన ఆకలి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని అందర్నీ శపించిన పీరయ్య కూడా తన ఆకలి తీరేసరికి అందరిలా మారిపోయాడనీ, ఇప్పుడతనికి అంతవరకూ తనుపయోగించుకున్న ఎద్దు ఆకలి గుర్తుండదనీ, దాని ఉనికి అతడు తిరిగి గుర్తించేది మర్నాడు ఉదయమేననీ-అయినా అది అతని తప్పుకాదనీ-అసలు మనిషి నైజమే అంతనీ దానికి తెలీదు.

ఒకవేళ తెల్సినా పీరయ్యలా అడుక్కోవడంగానీ, ఆకలి తీర్చని వాళ్ళని శపించడం గానీ దానికి చేతకాదు.

అందుకే ఇంకా ఆశగా, దీనంగా అతని వేపే చూస్తూంది. *

(సౌమ్య మాసపత్రిక మార్చి 1979)